ఘనంగా నాగుల చవితి పూజలు



జడ్చర్లలో బంగారుమైసమ్మ ఆలయంలో పాలు పోస్తున్న భక్తులు



జిల్లా కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో నాగ దేవతలకు పూజలు చేస్తున్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్/జడ్చర్ల: జిల్లా వ్యాప్తంగా గురువారం నాగుల చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. మహిళలు నాగ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపవాస దీక్షలు చేపట్టిన పలువురు మహిళలు ఆలయాల ప్రాంగణంలో ఉన్న నాగుల పుట్టల వద్ద, నాగుల విగ్రహాల వద్ద ప్రత్యేక అభిషేకాలు చేశారు. పిల్లలమర్రి రోడ్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో, వీరన్నపేట పాత శివాలయంలో, శ్రీనివాస కాలనీలోని పంచముఖాంజనేయాలయంలో, వేంకటేశ్వర కాలనీలోని రాజరాజేశ్వరీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

త్వరలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు

అడ్డాకుల: ప్రభుత్వం త్వరలో అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం 17 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అదేవిధంగా 19 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసి మాట్లాడారు. రైతులకు రుణమాఫీ ఎక్కడ చేశారని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. రుణమాఫీ ఎక్కడ చేశామో నా నియోజకవర్గానికి వస్తే చూపిస్తానని అన్నారు. సాంకేతిక కారణాలతో రాని వారిని గుర్తించి వారికి వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.



పెద్దమునుగల్‌ఛేడ్‌లో మొక్క నాటుతున్న ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి

పెద్దమునుగల్‌ఛేడ్ వద్ద విద్యుత్ ఉప కేంద్రాన్ని సాయంత్రం దేవరకద్ర, వనపర్తి ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, తూడి మేఘారెడ్డిలు ప్రారంభించారు. అక్కడే మొక్కలు నాటి నీళ్లు పోశారు.

'సమాజంలో సమానత్వం తీసుకురావాలి'



మాట్లాడుతున్న పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.చంద్రకిరణ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సమాజంలో లింగ సమానత్వం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పీయూలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.చంద్రకిరణ్ అన్నారు. గురువారం పీయూలో సోషల్ సైన్స్ విభాగం, రుబరో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుతుచక్రం, శుభ్రతపై మహిళలను చైతన్యం చేయాల్సిన బాధ్యత యువత మీద ఉందన్నారు. లింగబేధం లేకుండా అవకాశాలు సమానంగా పంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సోషల్ వర్క్ హెచ్‌ఓడీ డా.బండి పర్వతాలు, ఆచార్యులు, అధ్యాపకులు డా.భూమన్న, రాఘవేందర్, డా.చంద్రశేఖర్, మాధురి, రుబరో సంస్థ ప్రతినిధులు జీశాన్, మెహరీన్, డా. నిఖిల, అనిత, శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



భూత్పూర్: మండలంలోని కొప్పెటలో గురువారం ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. వేద పండితుడు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో పూజలు చేపట్టారు. శుక్రవారం ఆంజనేయస్వామి విగ్రహం, ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మాజీ ఎంపీటీసీ మృతికి నివాళి

జడ్చర్ల టౌన్: ఆత్మహత్యకు పాల్పడిన మాజీ ఎంపీటీసీ జగన్ మృతదేహం వద్ద మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ గురువారం నివాళి అర్పించారు. ప్రజాప్రతినిధిగా, నాయకుడిగా తనతో ఉన్న అనుబంధాన్ని మాజీ ఎమ్మెల్యే గుర్తు చేస్తూ మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

చిన్నచింతకుంట: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర రెడ్డి అన్నారు. మండలంలోని తిర్మలాపురం చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు కావలి పెద్ద బాలప్ప, అశోక్ అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం గ్రామంలోని వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్ అప్పగింత

దేవరకద్ర రూరల్: చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను పోలీసులు మొబైల్ ట్రేసింగ్ ద్వారా పట్టుకున్నారు. బస్వాయపల్లికి చెందిన పారిజాత గత నెల 22న గ్రామంలో సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. ఈ విషయంపై బాధితురాలు దేవరకద్ర పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫోన్‌తో పాటు రికవరి అయిన రూ.5వేలను గురువారం బాధితురాలికి పోలీసులు అప్పగించారు.

పెద్దగుట్ట ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

జడ్చర్ల టౌన్: శ్రావణమాస ఉత్సవాలకు సంబంధించి పోస్టర్లను గురువారం రంగనాయక పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వరాంరెడ్డి ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి శనివారం మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రఘురాంగౌడ్, విక్కి, సంతోష‌చారి, ఫణిరాజ్‌గౌడ్, ఎడ్ల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఈతమొక్కల పెంపకానికి ప్రోత్సాహం

రాజాపూర్ (బాలానగర్): గ్రామాల్లోని బంజరు భూముల్లో, చెరువు కట్టలపై ఈత మొక్కలను పెంచుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఉడిత్యాల శివారులో గౌడ కులస్తుల సొసైటీకి చెందిన భూమిలో ఈతమొక్కలను నాటారు.

ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధంకండి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలకి సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఎం చెందిన నాయకుడు బాగీకృష్ణయ్య యాదవ్ సీపీఐలో చేరారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీరి చేరికతో పారిశ్రామిక వాడైన జడ్చర్ల, భూత్పూర్, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో ఏఐటీయూసీ విస్తరణకు దోహదపడుతుందని అన్నారు.

పగిలిన ఆర్టీసీ బస్సు టైరు: తప్పిన ప్రమాదం



మహమ్మదాబాద్: ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు టైరు పగిలిపోవడంతో డ్రైవరు అక్కడే నిలపడంతో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గురువారం ఉదయం 10:30 గంటల ప్రాంతంలో తాండూరు నుంచి మహబూబ్‌నగర్ వెళ్తుంది. మొకర్లాబాద్ బ్రిడ్జి దాటి 200మీటర్ల దూరం రాగానే బస్సు వెనుక టైరు పగిలిపోయింది. అప్రమత్తమైన డ్రైవరు అక్కడే నిలిపివేశాడు. 50మందికి పైగా ప్రయాణికులు దిగి వేరేబస్సులో వెళ్లిపోయారు. బుధవారం ఉదయం కూడా తాండూరు డిపోకు చెందిన బస్సు ఇదే ప్రాంతంలో వెనుకటైరు పగిలి ప్రయాణికులకు తీవ్ర అంతరాయం కలిగింది. నిత్యం బస్సుల టైర్లు పగలడానికి కారణం ఏమిటని అధికారులు పరిశీలించడం లేదనే సందేహాలు ప్రయాణికులకు కలుగుతున్నాయి.

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు



బీకేరెడ్డికాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సీజనల్ వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీకేరెడ్డికాలనీ, అయోధ్యనగర్, కోయనగర్‌కు చెందిన ఒక్కొక్కరికి డెంగీ సోకింది. దీంతో ఆయా ప్రాంతాల్లో ఆమె పరిశీలించి బాధిత కుటుంబాలతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఇంటి వద్ద సంపుల్లో, డ్రమ్ములలో ఎక్కువ రోజులు నీరు నిల్వ చేయొద్దన్నారు.

ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలందించాలి

కోయిల్‌కొండ: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యసేవలందించాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. గురువారం మండలంలోని కోత్లాబాద్ పీహెచ్‌సీని ఆమె అకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యసేవలపై ఆరాతీశారు. అదేవిధంగా ఓపి సేవలు పెంచాలన్నారు.

వేపూర్ డంపింగ్ యార్డు పరిశీలన

హన్వాడ: మండలంలోని వేపూర్‌లో గురువారం సాయంత్రం కలెక్టర్ విజయేందిరా బోయి ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రామంలోని డంపింగ్‌యార్డును పరిశీలించారు.

ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలి

భూత్పూర్: ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలని గురువారం నయాబ్ తహసీల్దార్ గీతకు బీజేపీ ఎస్సీ మోర్చ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. చేవేళ్లలో జరిగిన బహిరంగసభలో ఇచ్చిన హామీలను నేరవేర్చాలని, అంబేడ్కర్ అభయ హస్తం రూ.12లక్షలు, ఎస్సీ కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించలేదని, దళితులకు శాశ్వత ఇళ్ల నిర్మాణాలకు రూ.5లక్షలు ఇస్తానని బడ్జెట్‌లో కేటాయించలేదన్నారు. పట్టణ ఎస్సీ మోర్చ అధ్యక్షుడు రాము, పట్టణ అధ్యక్షుడు రవీందర్, ఫారూఖ్, సుదర్శన్‌రెడ్డి, పట్నం పరమేష్ ఉన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు



మిడ్జిల్: ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలను అప్‌గ్రేడ్ చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు నారాయణగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలో పలు పాఠశాలలో యూనియన్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తున్న యూనియన్‌కు అందరూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో రాజేందర్‌గౌడ్, మల్లయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: చోరీల నివారణకు ఆయా వీధులు, రోడ్ల వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని టూ టౌన్ సీఐ ఎజాజుద్దీన్ గురువారం ప్రకటనలో సూచించారు. ఇటీవల జిల్లా కేంద్రంలో చోరీలకు పాల్పడిన నిందితుడిని క్లూస్‌టీం పట్టుకున్నట్లు తెలిపారు. ఇతడిని మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బాలాజీనగర్‌కు చెందిన కిశోర్ సింగ్ అలియాస్ కిషన్‌సింగ్‌గా గుర్తించి ఈనెల 7న కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

తేలని 523 సర్వే నంబర్‌లోని ఆక్రమణలు

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో రెవెన్యూ అధికారులు కొనసాగిస్తున్న ఇళ్ల స్థలాల సర్వే మొదటి రోజు గురువారం తూతూమంత్రంగా కొనసాగింది. క్రిస్టియన్‌పల్లి రెవెన్యూ శివారులోని ఆదర్శ కాలనీలో సర్వేనంబర్ 523లో అతి విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసి కొందరు అక్రమార్కులు ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారు. అరికట్టే ఉద్దేశంతో రెవెన్యూ అధికారులు సర్వేకు శ్రీకారం చుట్టారు. మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సీరామ్, డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్, గిర్దావర్లు సుదర్శన్‌రెడ్డి, నర్సింగ్‌లతో పాటు రెవెన్యూ సిబ్బంది ఆక్రమణదారులను గుర్తించేందుకు, అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించడంలో నిమగ్నమయ్యారు. అయితే గతంలో కూడా ఈ విధమైన సర్వేలు నిర్వహించినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల ఈసారి జరుగుతున్నా సర్వే కూడా అదేవిధంగా ఉంటుందని ఆ ప్రాంత ప్రజలు చర్చించుకుంటున్నారు.

పంచాయతీ కార్మికుల ధర్నా

మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రకారం పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ ఎంప్లాయిడ్ అండ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం మల్టీపర్పస్ విధానం రద్దు చేసి, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాటివిటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

మహమ్మదాబాద్: కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. తహసీల్దార్ తిరుపతయ్యకు వినతిపత్రం అందించారు.

జడ్చర్ల టౌన్: పంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య డిమాండ్ చేశారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులతో కలిసి ఆందోళన నిర్వహించారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులు గురువారం తమ ఆందోళనల్లో భాగంగా డిమాండ్ బ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ కోసం ఉద్యమించాలి

మహబూబ్‌నగర్ రూరల్: కులగణన, బీసీ రిజర్వేషన్ కోసం బీసీలంతా ఉద్యమం చేయాలని బీసీ మేధావుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాండురంగం పిలుపునిచ్చారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో బీసీల కులగణన, బీసీల రిజర్వేషన్‌పై చర్చావేదిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీలు ఓటింగ్ యంత్రాలు కాదు వారికి కూడా రిజర్వేషన్ బీసీల జనాభాను బట్టి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు తక్షణమే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి రాంచందర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం ఇలా అనేక రకాల సమస్యల పరిష్కారం కోసం పేద ప్రజలు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం తక్షణమే పూనుకోవాలని, లేకుంటే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటేష్, చంద్రన్న, గణేష్, రాజు, బాలు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ చౌరస్తాలో ధర్నా చేస్తున్న నాయకులు

పురుగుల సమస్యను తప్పించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

దేవరకద్ర రూరల్: కౌకుంట్ల రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ఎఫ్‌సీఐ గోదాముల నుంచి వస్తున్న బియ్యం పురుగుల సమస్యను పరిష్కారించాలని కోరుతూ గ్రామస్తులు గురువారం తహసీల్దార్ ఎల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. గ్రామ సమీపంలో ఉన్న ఎఫ్‌సీఐ గోదాంలోని బియ్యం నిల్వ చేసిన నిర్వాహకులు, అధికారులు సరైన చర్యలు తీసుకోవడంతో బియ్యం పురుగులు పెద్దసంఖ్యలో ఇళ్లలోకి చేరుతున్నాయని తెలిపారు. ఆ పురుగులు ఆహారంలో పడుతుండటంతో తినలేకపోతున్నామని, శరీరంపై వాలడం వలన చిన్న పిల్లలతో పాటు, పెద్దలకు దురద, చర్మ సంబంధిత వ్యాధులు వస్తున్నట్లు చెప్పారు. నియంత్రించాలని అధికారులకు ఫిర్యాధు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. గోదాము నిర్వహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వికసించిన బ్రహ్మ కమలాలు

అరుదుగా పుష్పించే బ్రహ్మ కమలాలు పట్టణంలో గురువారం రాత్రి వికసించాయి. ఎక్కడైనా ఒకటో.. రెండో బ్రహ్మకమలాలు పుష్పిస్తాయి. అయితే పట్టణంలోని రిటైర్డ్ ఆర్మీకి చెందిన మల్లికేడి కొండాజీ, విజయలక్ష్మి దంపతుల ఇంట్లో ఏకంగా ఒక మొక్కకు ఏడు, మరో మొక్కకు రెండు పుష్పాలు పుష్పించాయి. దీంతో కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. – జడ్చర్ల



వామ్మో.. పాములు



ఉదండాపూర్‌లో ఒకేచోట బయటపడిన పాములు

మండలంలోని ఉదండాపూర్‌లో గురువారం ఒకేచోట ఏడు పాములు బయటపడ్డాయి. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మేస్త్రి సోమయ్య ఇంటి పునాది వద్ద పాము కనిపించడంతో సర్పరక్షకుడు డా.సదాశివయ్యకు ఆయన సమాచారం అందించారు. ఈ మేరకు తన శిష్యులైన రాహుల్, చంద్రశేఖర్‌లతో చేరుకుని పామును పట్టుకున్నారు. అదే చోటు నుంచి మరో పాము రావడం గమనించి తవ్విచూడగా.. మొత్తం ఆరు పాములు బయటపడ్డాయి. చాకచక్యంగా వాటిని సంరక్షించారు. సదాశివయ్య మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో నీరు రంధ్రాల్లోకి వెళ్లి పాములు బయటకు వస్తాయన్నారు. పట్టుకున్న పామును అంఫియస్మా స్టొలేటమ్‌గా పిలుస్తారని చెప్పారు. అయితే పాములు విషరహితమైనవన్నారు. ఇలాంటి పాములు గుంపులుగా ఉండటం సహజమన్నారు. – జడ్చర్ల టౌన్

విద్యారత్న అవార్డు గ్రహీతకు సన్మానం



మన్నెమోని కృష్ణయ్యను సన్మానించిన అధ్యాపకులు, విద్యార్థులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పీయూలో పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మన్నెమోని కృష్ణయ్యకు విద్యారత్న జాతీయ పురస్కారం వచ్చినందున తెలుగు శాఖ అధ్యక్షురాలు డా.ఎస్.సంధ్యారాణి ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా పీయూలో గురువారం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్రకిరణ్, అధ్యాపకులు అర్జున్‌కుమార్, గాలెన్న, నాగసుధ, బషీర్‌అహ్మద్, కరుణాకర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

హాస్టళ్లు, పాఠశాలల సందర్శన

మిడ్జిల్: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను, కేజీబీవీ, సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ జగదీశ్వర్, వైద్యాధికారి శివకాంత్ తదితరులు సందర్శించి విద్యార్థులు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జంగయ్య, సంపత్, దేవయ్య, గీతా తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ చట్టం జాతీయ స్థాయిలో అమలు చేయాలి

మహబూబ్‌నగర్ రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ సమీక్షించి దళితుల జనాభా నిష్పత్తి ప్రకారం కేటాయించి ఆ నిధులను ఖర్చు చేయాలని గురువారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కేవీపీఎస్, ఏఐఏడబ్ల్యూ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మాణిక్యంరాజు మాట్లాడుతూ నీతి అయోగ్ సిఫార్సుల ప్రకారం దళితుల జనాభా ప్రకారం 16.2 శాతం కేటాయించాలని, కానీ గత పది సంవత్సరాల బడ్జెట్‌లో 11 శాతం దాటలేదని అన్నారు. ధర్నాలో హన్మంతు, భరత్, మనోహర్, భగవంతు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌సీ మంజూరు చేయిస్తానని మోసం

నవాబుపేట: సీఎస్‌సీ కేంద్రం మంజూరి చేయిస్తామని చెప్పి నగదు కాజేసినట్లు బాధితుడు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. మండల కేంద్రంలో ఇంటర్‌నెట్ సెంటర్ నిర్వాహకుడు జైపాల్‌కు ఓ వ్యక్తి ఫోన్ చేసి భువనేశ్వర్ నుంచి మాట్లాడుతున్నామని మీకు సీఎస్‌సీ కేంద్రం కావాలంటే రూ.10,500 పంపాలని తెలిపారు. అది నిజం అని నమ్మి డబ్బులు ఫోన్‌పే ద్వారా పంపాడు. వివరాలు తీసుకున్న అనంతరం మరో రూ.50 వేలు పంపిస్తే మీకు సెంటర్ అలాట్‌మెంట్ చేస్తామని చెప్పడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

కూలిన ఇళ్లపై ఆరా

నవాబుపేట: వర్షాలతో దెబ్బతిన్న ఇళ్ల వివరాలు సేకరించేందుకు గురువారం హౌసింగ్ డీఈ భాస్కర్, తహసీల్దార్ నాన్యనాయక్ ఆరాతీశారు.

12 నుంచి హజ్రత్ రవూఫ్‌బాబా ఉర్సే షరీఫ్



వేడుకల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మతపెద్దలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం వీరన్నపేటలోగల హజ్రత్ సయ్యద్ మహ్మద్ రవూఫ్‌బాబా దర్గా 46వ ఉర్సే షరీఫ్ ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ముతవల్లీ మహ్మద్ అబ్దుల్ గఫూర్ నియాజీ తెలిపారు. దర్గా ఆవరణలో గురువారం వేడుకల పోస్టర్లను మతపెద్దలు ఆలిండియా సున్నీ ఉల్మా మషాయఖ్ బోర్డు ప్రధాన కార్యదర్శి మౌలానా మొహిసిన్‌పాష ఖాద్రీ, మౌలానా వారిస్‌పాష ఖాద్రీ షర్ఫీ, మహ్మద్ ఇబ్రాహీం ఖాద్రీ షర్ఫీ (ఖాదిమ్ దర్గా), మొయిజుద్దీన్‌ఖాద్రీ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముతవల్లీ మాట్లాడుతూ 12వ తేదీ రాత్రి 7:30 గంటలకు గుస్లే షరీఫ్ (జలాభిషేకం), 9 గంటలకు జల్సా ఫైజానే అవులియల్లా ధార్మిక సభ ఉంటుందని తెలిపారు. ప్రధానఘట్టమైన గంధోత్సవ ఊరేగింపు ఈనెల 13వ తేదీన సాయంత్రం 5:30 గంటలకు ఉంటుందని, ఇషా నమాజ్ అనంతరం దర్గాలో పూలు చాదర్లు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని తెలిపారు. రాత్రి 10 గంటలకు మహిఫిలే సమా ఖవ్వాలి ఉంటుందని చెప్పారు. 14వ తేదీన రాత్రి 7 గంటలకు దీపారాధన (చిరాగా) నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం నాతియ ముషాయిరా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15న ఉదయం 9 గంటలకు ఖత్మే ఖురాన్, మహిఫిలే ఖుల్ ప్రార్థనలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సయ్యద్ యూసుఫుద్దీన్‌ఖాద్రీ, హాఫిజ్ మహ్మద్ బిలాల్, మకీన్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

బెంగాల్ మాజీ సీఎంకు ఘన నివాళి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): బెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి గురువారం సీపీఎం కార్యాలయంలో పూలమాలలు వేసి నివాళి అర్పించారు. యువజన ఉద్యమ నాయకుడిగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అనేక పోరాటాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోపాల్, రాంరెడ్డి, కురుమూర్తి, రాజ్‌కుమర్, పద్మ, భరత్‌నందు, లక్ష్మన్, భగవంతు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): డీఆర్‌డీఓ కార్యాలయంలో 9 వాహనాలు అద్దెకు నడుస్తున్నాయని వాటికి చెందిన బిల్లులు 15 నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ హైర్ వెహికిల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ తెలిపారు. గురువారం డీఆర్డీఓ నర్సింహులుకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ.. బిల్లులు రాకుంటే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ఎన్ని సార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఒకటో వార్డు పరిధిలోని మెట్టుగడ్డ డైట్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను గురువారం రాత్రి మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు.